# 20వేల మోటర్లకు నిరంతర విద్యుత్

- 24 గంటలూ నాణ్యమైన కరెంట్
- జనరేటర్ల మోత నుంచి విముక్తి
- పెరిగిన యజమానుల ఆర్థిక స్థితి

ఇల్లెందు, నవంబర్ 20: వలసాంధ్ర ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ 55 సంవత్సరాల పాలనలో కరెంట్ కోసం జనం నిత్యం నరకం చూశారు. పది రోజులకో రకంగా విద్యుత్ సరఫరా చేసేవారు. అది కూడా ఇష్టారాజ్యం. 'ప్రాణం పోకడ, కరెంట్ రాకడ ఎవరూ చెప్పలేరు' అనే విధంగా ఉండేది నాటి పరిస్థితి. దీంతో చిన్నా చితక పరిశ్రమలు, సినిమా థియేటర్లు జనరేటర్లు, ఇన్వర్టర్లను ఏర్పాటు చేసుకోవాల్సిన స్థితి. జనరేటర్లు, ఇన్వర్టర్ల కొనుగోలు, నిర్వాహణ ఖర్చులు భరించలేక యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరెంట్ బిల్లులకు తోడు జనరేటర్ల నిర్వాహణ ఖర్చులు ఎక్కువయ్యాయి. దీంతో యజమానులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూశారు. రైతులది మరో గోస. పగలు కొన్ని గంటలు, రాత్రుళ్లు మరికొన్ని గంటల కరెంట్ ఇస్తుండడంతో రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు. తేలు, పాము కాట్లు, విద్యుత్ షాక్‌లతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. గృహాలకు కూడా ఒక పూటంత కరెంట్ ఇవ్వలేదు. రాత్రుల్లో కూడా కరెంట్ కోతలు. ఎవరిని అడగాలో తెలియని దుస్థితి.

కరెంట్ కోతల వల్ల ఇల్లెందు నియోజకవర్గంలోని వ్యవసాయ రంగం, చిన్న పరిశ్రమలు తీవ్రంగా నష్టాలు చవిచూశాయి. పరిశ్రమలకు ప్రతి రోజు ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటల కోతలను అధికారికంగా ప్రకటించేవారు. విద్యుత్ కేటాయింపులు తక్కువగా ఉండి డిమాండ్ ఎక్కువ ఉన్న కారణంగా గ్రిడ్‌లో నిత్యం సమస్యలు తలెత్తేవి. దీనికితోడు పవర్ హాలీడేలు. చిన్నా చితక పరిశ్రమలు వారానికి రెండు మూడు రోజులు మూతపడేవి. లఘు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దశకు చేరుకోవడంతో రోడ్డున పడ్డారు. కుటుంబాలను పోషించుకోవడం కోసం పరిశ్రమలలో పనిచేసిన కార్మికులు రోజు వారి కూలీ పనులకు వెళ్ళాల్సి వచ్చేది.

**ఏడాదిన్నరలోపే కరెంట్ కష్టాలకు చెక్..**

తెలంగాణ ఉద్యమ నాయకుడే స్వరాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణ ప్రాంత పరిస్థితి మారింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యలు చేపట్టిన వెంటనే వ్యవసాయం, విద్యుత్ రంగాలపై దృష్టి సారించారు. ఏడాదిన్నరలోపే కరెంట్ కష్టాలకు చెక్ పడింది. అనతి కాలంలోనే 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇచ్చారు. ఇక నియోజకవర్గంలోని లఘు పరిశ్రమల యజమానులు పవర్ హాలీడేలకు హాలీడే ప్రకటించారు. వలసాంధ్ర పాలనలో కరెంట్ కోసం పడిన కష్టాలను మర్చిపోయారు. జనరేటర్ల మోతకు విముక్తి కలిగింది. ఇన్వర్టర్ల భారం దిగింది. విద్యుత్ బిల్లులు, నిర్వహణ ఖర్చులు తగ్గి యజమానులు ఆర్థికంగా పురోగమిస్తున్నారు. ప్రభుత్వం 24గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నది. కోతలు లేకుండా కరెంట్ వస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ చీకటి పాలన నుంచి విముక్తి చెందిన అన్ని వర్గాల ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలబడతామంటున్నారు.

### 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్



దేశంలో ఏ ఒక్క రాష్ట్రంలో కూడా 24గంటల కరెంట్ ఇవ్వడం లేదు. కేవలం తెలంగణలోనే 24 గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే. కాంగ్రెస్ పార్టీ అందించిన కటికి చీకటి పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదు. 11 సార్లు దేశంలో, రాష్ట్రంలో పాలన సాగించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల కనీస అవసరాలను కూడా తీర్చలేదు. కరెంట్ కొతలు, ట్రాన్స్‌ఫార్మర్ల పేలుడు, మోటార్లు కాలుడు. రైతుల బాధలను అయితే ఏనాడు పట్టించుకున్న పాపానపోలేదు. కాంగ్రెస్ దుష్ట పాలనకు చెరమగీతం పాడుతూ మహోద్యమాన్ని నిర్మించిన నేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాని తెచ్చాడు. తెలంగాణ ప్రజల బాధలు తెలిసిన నాయకుడు కాబట్టే కరెంట్ కష్టాలను తీర్చారు. ఇపుడు అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే మనకు శ్రీరామ రక్ష.

**- ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్**

### తెలంగాణలో ఉన్నందుకు గర్వపడుతున్న



తెలంగాణ రాష్ట్రంలో ఉన్నందుకు గర్వపడుతున్న. 32 సంవత్సరాలుగా వెల్డింగ్ పనిచేస్తున్న. ఈ తొమ్మిదిన్న ఏళ్ల లో వస్తున్న 24గంటల కరెంట్ గతంలో ఎన్నడూ రాలేదు. అప్పుడు నిత్యం కరెంట్ కోతలు. పనిసరిగా నడవకపాయేది. బతుకుడే కష్టంగా మారేది. కానీ ఇప్పుడు నిరంతరంగా కరెంటు వస్తుండటంతో వెల్డింగ్ పనులు పూర్తిగా చేయగలుగుతున్నాం. వ్యాపారం మంచి జరిగి డబ్బులు మంచిగా వస్తున్నాయి. ఆయన వస్తేనే పేదలకు, చేతివృత్తుల వారికి న్యాయం జరుగుతుంది. కేసీఆర్ సార్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం పక్కా.

**- ఎండీ మున్నా, వెల్డింగ్ షాప్, ఇల్లెందు**

### కరెంట్ కోతల వల్ల చాలా నష్టపోయాం



పిండి మిల్లును 16 సంవత్సరాలుగా నడుపుతున్నాను. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు మాములుగా లేవు. కరెంట్ కోతల వల్ల నేను చాలా నష్టపోయాను. పిండి మర స్టార్ట్ చేసిన కొద్ది సేపటికే కరెంట్ పొయ్యేది. రెండు మూడు గంటల తర్వాత వచ్చేది. ఒక్కోసారి ఒక పూటంతా కరెంట్ రాకపొయ్యేది. ఇక రూం కిరాయి కట్టడం కష్టంగా ఉండేది. వడ్డీలకు అప్పులు తెచ్చి కార్మికులకు వేతనాలు, రూం కిరాయి కట్టాల్సి వచ్చేది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక కరెంట్ కష్టాలు తప్పాయి. కేసీఆర్ సార్ పాలన చాలా బాగుంది.

**- బత్తుల నాగేశ్వరరావు, పిండి మిల్లు, ఇల్లెందు టౌన్**

### సాయంత్రం నుంచి కరెంట్ వాడొద్దన్నరు



40 ఏళ్లుగా పౌండ్రిని నాన్న నడిపించారు. నేను 20 ఏళ్లుగా నడుపుతున్నాను. తెలంగాణ రాష్ట్రం రాక ముందు కరెంట్ సరిగ్గా రాక అనేక ఇబ్బందులు పడ్డాం. వారానికి రెండు రోజులు పవర్ హాలీడే ఉండేది. తర్వాత రోజుల్లో కూడా సాయంత్రం 6 గంటల నుంచి కరెంట్ వాడొద్దని అధికారులు ఆదేశాలిచ్చేవారు. పనులు జరిగేవి కావు. పని ఉన్నా కరెంట్ లేక ఖాళీగా ఉండేవాడిని. ఆర్థికంగా చాలా నష్టం పోయాం. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక కరెంట్ కోతలు లేవు. 24 గంటలు కరెంట్ మంచిగా ఉంది. వ్యాపారం బాగుంది.

**- ఎంఏ సలీం, పౌండ్రి, ఇల్లెందు టౌన్**

# నమ్ముకున్న వారికి సముచిత స్థానం కల్పిస్తాం

**బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ**





గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ, పార్టీలో చేరిన వారితో హరిప్రియ

టేకులపల్లి, నవంబర్ 20: పార్టీని నమ్మి వచ్చిన ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. మండలంలోని గోలీయ తండా గ్రామ పంచాయతీకి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 50మంది బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం గోలీయతండాలో హరిప్రియ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆమె గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంత మంది మాయమాటలు చెబుతూ వస్తున్నారని, వారి కళ్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఏ ఒక్క కార్యకర్తకు ఎలాంటి సమస్య వచ్చినా నాకు ఫోన్ చేసిన గంటలోనే అక్కడ వాలిపోతానన్నారు. ఎవరు భయపెట్టినా భయపడకుండా నిర్భయంగా మీ ఓటుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటువేసి నన్ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి బోడ బాలునాయక్, ఎంపీటీసీ జాలది అప్పారావు, నాయకులు బానోత్ రామానాయక్, మాలోత్ రాజేందర్, మౌలన, బానోత్ బన్సీలాల్, బానోత్ కిషన్‌నాయక్, చీమల సత్యనారాయణ, అనంతుల శ్రీను, బానోత్ రవి, బోడ ప్రసాద్, మూడ్ శోభన్, బోడ రవి, భూక్యా ప్రవీణ్, బోడ హుస్సేన్, నరేశ్, చందర్, బిచ్చు, సక్రు, బానోత్ మణిశర్మ, గణేశ్ పాల్గొన్నారు.

## పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ ప్రచారం





ఇల్లెందు: వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న మడత

ఇల్లెందు, నవంబర్ 20: ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియ గెలుపును కాంక్షిస్తూ సోమవారం పట్టణంలోని 21, 22, 23, 24వ వార్డుల్లో నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే హరిప్రియ ఇల్లెందు పట్టణానికి రూ.315 కోట్లు తీసుకొచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ఆరు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న బస్‌డిపోను తీసుకొచ్చారని కొనియాడారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో 5వ నంబర్ ఉన్న కారు గుర్తుపై ఓటు వేసి హరిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ రంగనాథ్, జానీపాషా, తారా, రవిశంకర్, కమల్‌కోరి, స్రవంతి, ధనలక్ష్మి, కొర్లపాటి కిరణ్, కొప్పుల సమ్మయ్య, పాలడుగు రాజశేఖర్, మల్లేష్, మునాఫ్, శివ, అజయ్ తదితరులున్నారు.

**చింతోనిచెలకలో..**



టేకులపల్లి మండలం చింతోనిచెలకలో ప్రచారం చేస్తున్న నాయకులు

టేకులపల్లి, నవంబర్ 20: ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ గెలుపు కోసం మండలంలో నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. సోమవారం మండలలోని చింతోనిచెలక గ్రామంలో జిల్లా నాయకుడు కంభంపాటి చంద్రశేఖర్‌రావు, సర్పంచ్ ఈసం నీలమయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, ప్రతి ఇంటికి చేరిన సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తు ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి హరిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు



సీమంతం చేస్తున్న సీడీపీవో తార

టేకులపల్లి, నవంబర్ 20: మండలంలోని తొమ్మిదోమైలు తండా అంగన్‌వాడీ–1, 2 సెంటర్లో సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో సీడీపీవో కేఎం తార సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాస వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

## సప్లిమెంటరీ ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 20: సప్లిమెంటరీ ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల పరిశీలించారు. జిల్లాకు మొదటి విడత కేటాయించిన ఈవీఎంలకు అదనంగా 160 బ్యాలెట్ యూనిట్లు ఎన్నికల సంఘం కేటాయించినట్లు చెప్పారు. బ్యాలెట్ యూనిట్లను గోదాంలో భద్రపరిచామన్నారు. సీసీ కెమేరాలు పరిశీలించి తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ నుంచి ఎంఏ రజాక్, సంతోశ్‌కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.